క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


మీసాల ఆదమ్మ(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని నడిమివలస గ్రామానికి చెందిన మీసాల ఆదమ్మ(101) మంగళవారం రాత్రి మృతి చెందింది. ఈమె భర్త, దివంగత మీసాల జోగినాయుడు 40 ఏళ్లపాటు సర్పంచ్‌గా వ్యవహరించారు. ఈమె కుమారుడు మీసాల వెంకటరమణ ప్రస్తుతం ఎంపీపీగా ఉన్నారు. ఆదమ్మ మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

సంప్రదాయం కల్చరల్ ట్రస్ట్‌కు విరాళం

శ్రీకాకుళం కల్చరల్: కూచిపూడి సంప్రదాయ గురుకులం విద్యార్థులు ప్రదర్శన కోసం మలేషియా వెళ్లగా అక్కడ కౌలాలంపూర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం సంప్రదాయం కల్చరల్ ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందజేశారని డైరెక్టర్ స్వాతీసోమనాథ్ మంగళవారం తెలిపారు. కళాకారుల ప్రదర్శన మెచ్చి తమ బృందానికి ఈ విరాళం అందించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు మహేష్

గార: మండలంలోని కొర్ని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముద్దపు మహేష్ రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడని హెచ్ఎం వై.వాసుదేవరావు, పీఈటీ రమణ తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మహేష్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

క్రీడాకారుడికి అభినందనలు

రణస్థలం: ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్-14 వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా జట్టులో సభ్యుడైన కొవ్వాడ హైస్కూల్ విద్యార్థి మైలపల్లి సతీష్‌కుమార్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి.పద్మావతి, పీఈటీ గోవింద అప్పన్న, స్కూల్ కమిటీ చైర్మన్ సూరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అంపోలు విద్యార్థుల ప్రతిభ

గార: ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్‌లో అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మోడ్రన్ పెంటాత్లన్ విభాగంలో వై.జయవర్ధన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా, బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో ఏ.నవీన్ ద్వితీయ స్థానం, టెన్నికాయిట్ విభాగంలో పి.ధనుష్ తృతీయ స్థానం సంపాదించారు. వీరిని హెచ్ఎం జ్యోతి లక్ష్మీనారాయణ, స్టాఫ్ సెక్రటరీ వీవీఆర్ మూర్తి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ జి.ప్రసాదరావు మంగళవారం అభినందించారు. విద్యార్థులకు డాకోజు మన్మధరావు నగదు బహుమతి అందజేశారు. పీడీలు టి.శ్రీనివాసరావు, ఎల్.సీతారామరాజును అభినందించారు.

సత్తాచాటిన నారువ విద్యార్థులు

రణస్థలం: వైఎస్సార్ కడప జిల్లా రైల్వే కోడూరులో నవంబర్ 9, 10, 11 తేదీల్లో జరిగిన అండర్-19 బాలికల హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన నారువ విద్యార్థులు నిద్రబంగి ఇందుమతి, కొంతాల దేవి, గిన్ని గోవిందమ్మలు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.భాస్కరరావు తెలిపారు. మంగళవారం వీరిని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ బి.ఢిల్లీశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆక్రమణదారుడికి నోటీసులు

శ్రీకాకుళం రూరల్: ప్రభుత్వ భూములు, దేవదాయ భూములు ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి రమేష్ హెచ్చరించారు. సింగుపురంలోని నడక దారి, దేవదాయ భూమిని ఆక్రమించి బాత్‌రూమ్ కట్టిన రుప్ప రమణమూర్తికి మంగళవారం నోటీసులు అందజేశారు. ఈ స్థలం ఆక్రమణకు గురైందని ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్, తహశీల్దార్లుకు ఫిర్యాదులు అందాయని సెక్రటరీ తెలిపారు.

నేటి శిక్షణ వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు జరగాల్సిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఒక్కరోజు శిక్షణ వాయిదా పడినట్లు ఎంపీడీవో ఎస్.హరిహరరావు ఒక ప్రకటనలో మంగళవరం తెలిపారు. శిక్షణ గురువారం జరుగుతుందని పేర్కొన్నారు.

తైక్వాండోలో జగదీశ్వరి ప్రతిభ

ఎచ్చెర్ల క్యాంపస్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న జాతీయస్థాయి అంతర విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీల్లో అంబేడ్కర్ వర్సిటీ క్రీడాకారిణి ఎల్.జగదీశ్వరి ప్రతిభ కనబరిచింది. 46 కిలోల విభాగంలో రెండు విజయాలు సాధించింది.

కూర్మనాథుని సన్నిధిలో జ్యోతిర్మయి


కూర్మనాథాలయంలో జ్యోతిర్మయి


గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని తిరుమల తిరుపతి దేవస్థానం గాయని, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. అంతకుముందు జొన్నలపాడు కాలనీలోని రామమందిరాన్ని సందర్శించారు.

ఆదిత్యుని తెప్పోత్సవం.. చూతము రారండి

- పుష్కరిణిలో హంసవాహనం ట్రయల్ రన్ విజయవంతం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

అరసవల్లి:

ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా హంస నావికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఇంద్రపుష్కరిణిలో స్వామివారి ఉత్సవమూర్తులతో విహార యాత్రగా తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చిలుకల ద్వాదశి, క్షీరాబ్ధి ద్వాదశిగా పిలుచుకునే ఈ తెప్పోత్సవం బుధవారం సాయంత్రం 4.15 గంటల నుంచి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రారంభం కానుంది. వేడుకలు రాత్రి 9 గంటల వరకు కొనసాగుతాయి. ఇందుకు సంబంధించి ముందుగా మంగళవారం ఉదయం వాహనం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈవో వై.భద్రాజీతో పాటు ప్రధానార్చకులు శంకరశర్మ, మత్స్యశాఖ, సాంకేతిక సిబ్బంది కలిసి పుష్కరిణిలో వాహనం తిప్పారు. ఫిట్‌నెస్ పరంగా అంతా సక్రమంగా ఉందని అధికారులు ధృవీకరించడంతో పాటు గరిష్టంగా 28 నుంచి 30 మంది వరకు మాత్రమే వాహనంలో ఉండేందుకు అనుమతినిస్తున్నట్లు ప్రకటించారు. ఆలయ అర్చకులు, తెప్పవాహనం నిర్వహణ సిబ్బంది మినహా మరెవ్వరికీ అనుమతినివ్వడం లేదని ఈఓ ప్రకటించారు.


విద్యుత్ వెలుగుల్లో ఆదిత్యాలయ ప్రధాన గోపురం

విద్యుత్ అలంకరణలో ఆదిత్యాలయం..

తెప్పోత్సవం సందర్భంగా ఆదిత్యాలయం అద్భుత వెలుగులతో ఆకట్టుకుంటోంది. ప్రధాన విమాన గోపురంతో పాటు రాజగోపురం, టూరిజం డార్మిటరీ, వసతి గదుల ప్రాంగణాలు, ఇంద్రపుష్కరిణి చుట్టూ విద్యుత్ దీపాలు అలంకరించారు.

బలగ అయ్యప్ప సన్నిధిలో..



శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం జరగనున్న తెప్పోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మణిగంగ పుష్కరిణి చుట్టూ ఉన్న బారికేడ్లు సిద్ధం చేశారు. ఉత్సవమూర్తులను తిరువీధి వీధులలో ఊరేగించి పుష్కరిణి వద్దకు తీసుకొస్తారు. ఈ వేడుక సాయంత్రం 6గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు, ప్రధాన అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ తెలిపారు. ఆలయ నిర్మాణం జరిగిన 1997 నుంచి ఉత్సవం నిరాటంకంగా సాగుతోందని చెప్పారు.

శ్రీకూర్మనాథుని సన్నిధిలో..



గార: ప్రముఖ విష్ణుక్షేత్రంలో శ్రీకూర్మంలోని కూర్మనాథాలయంలో క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా నిర్వహించనున్న తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆలయం ఎదురుగా నున్న శ్వేతపుష్కరిణిలో ఈ ఉత్సవం జరగనుంది. వందల ఏళ్ల నాటి పద్ధతిలోనే నాటుపడవలపై కూర్మనాథుడు విహరించనున్నారు. ముందుగా ఉత్సవమూర్తులను మేళతాళాలతో తిరువీధి నిర్వహించి మత్స్యనారాయణస్వామి ఆలయం వద్ద ఉన్న మెట్లవద్ద నుంచి పుష్కరిణిలోకి తీసుకువెళ్తారు. మధ్యలో ఉన్న ఉగ్రనరసింహుని చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేస్తారు. ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో జి.గురునాథం తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకోవాలని ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు కోరారు.

నిధుల వినియోగంపై శిక్షణ


శ్రీకాకుళం రూరల్: శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక నిధుల వినియోగంపై శ్రీకాకుళం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, పనుల వివరాలను గ్రామ స్వరాజ్‌లో అప్‌లోడ్ చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అంశంపై గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు, ఈవోపీఆర్‌డీ బి.మల్లేశ్వరరావు, పీఆర్ ఏఈ సూర్యచంద్రరావు, ఏవో పీవీఎస్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కిల్లారి నారాయణరావు పాల్గొన్నారు.



రణస్థలం: మాట్లాడుతున్న పిన్నింటి సాయికుమార్

రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ప్రత్యేకాధికారి కేవీ రమణ, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఏవో ధనుంజయరావు, ఈవోపీఆర్‌డీ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గార: మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, గార సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, ఏవో రఘు, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నష్టాలను అరికడదాం

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీకి నష్టాలు రాకుండా మన వంతుగా కృషిచేద్దామని ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ పిలుపునిచ్చారు. ఆర్టీసీ పరిరక్షణలో భాగంగా మంగళవారం కాంప్లెక్స్ ముందు ప్రైవేటు వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టారు.


ప్రైవేటు వాహనాలను నిలువరిస్తున్న ఆర్టీసీ అధికారులు

పకడ్బందీగా పల్లెపండుగ పనులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పల్లె పండుగ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మా బంగారం మాకివ్వండి

- గార ఎస్‌బీఐ వద్ద బంగారం ఖాతాదారుల నిరసన
- వడ్డీ కట్టాలంటూ వారం రోజులుగా ఫోన్ మెసేజ్‌లు, కాల్స్ రావడంతో ఆందోళన

గార: మండల కేంద్రంలోని గార స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి వద్ద బంగారం కుదవ పెట్టిన ఖాతాదారులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వడ్డీ చెల్లించాలంటూ వారం రోజులుగా మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ రావడంతో సిబ్బందిని నిలదీశారు. గతేడాది నవంబర్‌లో బంగారం మాయమైన ఘటన బయటపడగా డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న ఉరిటి స్వప్నప్రియ ఆత్మహత్య కూడా చేసుకున్న సంగతి తెలిసిందే.

ఎన్నిసార్లు అడుగుతున్నా..

మొత్తం డబ్బులు కట్టేస్తామని, తమ బంగారాన్ని తమకు ఇచ్చేయాలంటూ బ్రాంచి మేనేజర్ సత్యనారాయణను పలువురు తనఖాదారులు నిలదీశారు. ఏడాది కావస్తున్నా, ఎన్నిసార్లు బ్యాంకుకు వచ్చి అడుగుతున్నా కోర్టు పరిధిలో ఉందని తప్పించుకుంటున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయకపోతే బ్యాంకు వద్ద ధర్నా చేస్తామన్నారు. దేశంలో నెంబర్‌వన్ బ్యాంకుగా నమ్మితే, ఇప్పుడు అందరూ తప్పించుకుంటున్నారని మాజీ ఎంపీటీసీ జల్లు రాజీవ్, ఖాతాదారులు మండిపడ్డారు. న్యాయస్థానానికి బ్యాంకే ష్యూరిటీ ఇచ్చి తమ బంగారాన్ని తమకు అందజేయాలన్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు కలుగజేసుకొని పద్దులు తేల్చాలని డిమాండ్ చేశారు. కాగా, బీఎం మాట్లాడుతూ ఖాతాలకు లింక్ ఉండటం వల్ల అందరిలాగే మెసేజ్‌లు వస్తున్నాయని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.


గేటు వద్ద నిరసన తెలియజేస్తున్న ఖాతాదారులు

ఆన్‌లైన్‌లో చెల్లింపులు..

పుల్లటి శ్రావణి అనే ఖాతాదారు విదేశాల్లో ఉంటున్నారు. ఆమెకు కూడా మెసేజ్ వెళ్లడంతో ఆన్‌లైన్‌లో నగదును చెల్లించారు. ఇంకా మిగిలి ఉన్న పదివేలు చెల్లిస్తామని, తన తండ్రికి ఆభరణాలు ఇవ్వాలని అడిగితే.. కోర్టు పరిధిలో ఉందని, మీరు ప్రైవేటు కేసు వేసుకోవాలని బ్యాంకు సిబ్బంది సూచిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొందరు నగదు చెల్లించినట్లు తెలిసింది.

ఇదీ నేపథ్యం..

బంగారం పోయిందంటూ గతేడాది నవంబర్ 30న బ్యాంక్ ఆర్ఎం రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, డిసెంబర్ 8న రూ. 4.7 కోట్లు విలువైన 7.146 కిలోల బంగారాన్ని పోలీసులు రికవరీ చేసి నిందితులను అరెస్టు చేశారు. 65 మంది ఖాతాదారులకు చెందిన బంగారం ఈ కేసులో ఉంది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద రీ ఇన్వెస్టిగేషన్ చేయిస్తుండగా, అనుమానితునిగా ఉన్న ఆర్ఎం రాజును ఇప్పటికే పలుమార్లు విచారించారు.

మురుగు తొలగించారు


జేసీబీతో మురుగు తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని శివరామ్‌నగర్ కాలనీలో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయిన విషయమై 'కాలనీల్లో కాలు పెట్టలేం' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ స్పందించారు. సిబ్బందితో వెళ్లి జేసీబీతో మురుగు తీయించారు. దీంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇంటర్ పరీక్షల గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపు గడువు ఈ నెల 11తో ముగియగా.. తాజాగా ఈ నెల 21 వరకు గడువు పొడిగించినట్లు ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగాల్లోకి తీసుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన సేల్స్ మెన్లు, సూపర్‌వైజర్లను తిరిగి విధుల్లోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకుడు కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్రాంతిభవన్‌లో శ్రీకాకుళం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొత్స సంతోష్, కార్యదర్శిగా టి.కిషోర్, ఉపాధ్యక్షులుగా పి.కిరణ్‌కుమార్, టి.రాజా, సహాయ కార్యదర్శులుగా కె.శ్రీను, అనిల్, కోశాధికారిగా కె.రామోజీరావు ఎన్నికయ్యారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా అట్టాడ, అన్నెపు

శ్రీకాకుళం న్యూకాలనీ/ఎచ్చెర్ల క్యాంపస్: కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అట్టాడ రవిబాబ్జీ, ఎచ్చెర్ల మండలం కొత్తపేటకు చెందిన న్యాయవాది, టీడీపీ నేత అన్నెపు భువనేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు ప్రజాపోరు


ఎచ్చెర్ల క్యాంపస్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

రణస్థలం/ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 14న సీపీఎం నిర్వహించనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, వెలమల రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రణస్థలంలోని సీపీఎం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎచ్చెర్లలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, కార్మిక యూనియన్ సభ్యులు బంగార్రాజు, రామారావు, సురేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

తెప్పోత్సవ నిర్వహణకు పటిష్ట చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయం, శ్రీకూర్మంలోని కూర్మనాథ ఆలయంలో జరిగే తెప్పోత్సవం ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. ఈ మేరకు మంగళవారం గూనపాలెంలోని సబ్ డివిజనల్ కార్యాలయంలో పోలీస్, ఎండోమెంట్, రెవెన్యూ, ఫైర్, ఫిషర్స్ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలందించారు.

కల్యాణం..కమనీయం



అరసవల్లి సూర్యనారాయణ స్వామి అనివెట్టి మండపంలో మంగళవారం కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి కల్యాణం వైభవంగా జరిగింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణం జరిపించారు. ఈవో వై.భద్రాజీ, సూపరింటెండెంట్ కనకరాజు పాల్గొన్నారు.

– అరసవల్లి

ఉమాజఠలేశ్వరునికి భస్మాభిషేకం



శ్రీకాకుళం నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామివారికి భస్మాభిషేకం చేశారు. అర్చకులు అశ్వినీ కుమార్, మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆపదలో అండగా..



అనారోగ్యంతో మరణించిన హోం గార్డు పాలక సెంబుదు కుటుంబానికి తోటి సిబ్బంది అండగా నిలిచారు. తమ ఒకరోజు వేతన చెక్కు రూ.4.06 లక్షలను సెంబుదు భార్య సోములమ్మకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి సహాయం కావాలన్నా జిల్లా పోలీసుశాఖ అందుబాటులో ఉంటుందన్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

సంక్షిప్తంగా..

విద్యార్థులకు అపార్ తప్పనిసరి

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు అపార్ గుర్తింపు నంబరు తప్పనిసరిగా పొందాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. పెదపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించి అపార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. శ్రీకాకుళం ఎంఈఓ జి.కృష్ణారావు, తహశీల్దార్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీకాకుళం క్రైమ్ : హోంగార్డుల సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించారు.

జాతీయస్థాయిలో రాణించాలి

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఎస్పీని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం కలిశారు. జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ఎస్.నందిని (హోం గార్డు రాజేశ్వరరావు కుమార్తె), ఎం.గాయిత్రిలను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ ఫిజికల్ డైరెక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: వివిధ అభివృద్ధి పనుల్లో భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి అధికారులతో భూసేకరణ సమావేశం నిర్వహించారు. జమ్మూ-పాతపట్నం ఎన్‌హెచ్ 326 బైపాస్ రోడ్డు, పలాస ఆర్‌టీపీ పనులపై చర్చించారు.

రేపటి నుంచి సహకార వారోత్సవాలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 14 నుంచి 20 వరకు జరగనున్న అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు. ఈ మేరకు వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను జిల్లా సహకార అధికారి బి.నగేష్, డీసీసీబీ సీఈఓ వరప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు.

బాతువలో దంత వైద్యశిబిరం

జి.సిగడాం: బాతువ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయి డెంటల్ కాలేజ్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం భవానీ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వృద్ధుల సంరక్షణ సదస్సు

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత ప్రభుత్వం వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకొచ్చిన వయోవృద్ధుల సంరక్షణ చట్టం-2007పై జిల్లా న్యాయస్థానం ఆవరణలో బుధవారం ఉదయం 10:30 గంటల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంరక్షణ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు, కుమారుల నిర్లక్ష్యానికి గురైన తల్లిదండ్రులు సదస్సుకు హాజరు కావాలని కోరారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద రెల్లివీధిలో మంగళవారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా పరిశీలన చేశారు. ఎస్ఐ-1 సంతోష్‌కుమార్, ఎస్ఐ-3 రామారావు ఆధ్వర్యంలోని సిబ్బంది ఎస్పీ ఆదేశాల మేరకు స్థానికులతో సమావేశం నిర్వహించారు. గంజాయి క్రయవిక్రయాలు నేరమని, సమాచారం ఉంటే తెలియజేయాలన్నారు.

'బెల్టు' నిర్వహిస్తే రూ. లక్ష జరిమానా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఎక్కడ బెల్టుషాపులు నిర్వహించినా రూ.లక్షకు తగ్గకుండా సెక్షన్ 129 బీఎన్ఎస్ఎస్ యాక్టు ప్రకారం బైండోవర్ చేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంతరెడ్డి సంబంధిత ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఎంఆర్పీ ధరలకు విక్రయించే మద్యం షాపులపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి లైసెన్సుదారులపై కేసులు నమోదు చేయాలని, ఎక్సైజ్ పాలసీ 2024-26 యాక్టు ప్రకారం ఇతర ఉల్లంఘనలకు పాల్పడినా చర్యలు తీసుకోవాలన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల రిఫరీగా బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల రిఫరీగా చిలకపాలెం శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్ పీడీ టి.బాలాజీ ఎంపికయ్యారు. ఈ మేరకు జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నీటిమూటల బడ్జెట్

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నీటి మూటల బడ్జెట్‌గా మిగిలిపోయిందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా ఏకాదశి పూజలు



శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల/జి.సిగడాం: కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు ఆలయాలలో మంగళవారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.